క్లుప్తంగా

హోటల్ ఓనర్స్ అధ్యక్షుడు బాలకృష్ణకు సన్మానం



బాలకృష్ణను సన్మానిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జిల్లా హోటల్స్ ఓనర్స్ అధ్యక్షుడు బాలకృష్ణను శనివారం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సత్కరించారు. 52వ వార్డు శాంతినగర్‌లోని నివాసంలో శ్రీధర్‌ను బాలకృష్ణ కలిసి హోటల్స్ నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన్ను శ్రీధర్ సత్కరించి చిరు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీపీఎంఎస్ నూతన కార్యదర్శి మిశ్రాకు సత్కారం



మిశ్రాను సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

కంచరపాలెం: బీపీఎంఎస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కే మిశ్రా ఎన్నికైన సందర్భంగా శనివారం 104 ఏరియా బాపూజీనగర్‌లోని బీపీఎంఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ఐఎన్‌సీఎంఎస్ జనరల్ సెక్రటరీ రాజేష్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మిశ్రాను ఘనంగా సత్కరించారు. కార్మికుల సమస్యలపై మిశ్రా పోరాటాలు ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ పుట్టా విద్యాసాగర్, నాయుడు, సివిలియన్ మజ్దూర్ సంఘ్ గౌరవాధ్యక్షుడు దేవుడు నాయుడు, సత్యశ్రీనివాస్, చింతాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



మెడల్స్, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

విశాఖవిద్య: ఎన్‌ఏడీ కొత్తరోడ్డులోని రామకృష్ణా పాఠశాలలో శనివారం స్పోర్ట్స్ మీట్–ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యాసంస్థల అధినేత కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. స్పోర్ట్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంస్థ ప్రధానాచార్యుడు జీవీ రవీంద్రుడు, ఉప ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, గంగాభవాని, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌమారదశలో సమస్యలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

సింథియా: కౌమారదశలో అమ్మాయిలకు వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని మాస్టర్ ట్రైనర్ ఆఫ్ లివింగ్ శ్రీదేవి సూచించారు. ఆహారంలోనూ కొన్ని నియమాలను పాటించాలని సూచించారు. కౌమారదశలో బాలికలు ఎదుర్కొనే సమస్యలు, వాటి నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై నౌసేనాబాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం-1లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆ దశలో బాలికలకు పీసీవోఎస్, పీసీవోడీ వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అవి భావోద్వేగపరంగా వారిలో ఒత్తిడి, చికాకు కలిగిస్తాయన్నారు. వైద్యులను సంప్రదించడం ద్వారా వాటిని నియంత్రించవచ్చన్నారు. అలాగే ఆరోగ్యం కోసం యోగా, మానసిక ప్రశాంతత ధ్యానం వంటివి చేయాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మైంగీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ఆహ్లాదం ఆనందం ఆరోగ్యం



వ్యాయామ పరికరాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆధునికీకరించిన పార్కులు నగర వాసులకు ఆహ్లాదం పంచుతున్నాయి. చిన్నా పెద్దా కలయికకు వేదికలుగా మారాయి. ఆరోగ్య పరిరక్షణకు నిలయాలుగా నిలుస్తున్నాయి. దానికి జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని న్యూ పార్కు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. పార్కులో వ్యాయామానికి అవసరమైన ఓపెన్ జిమ్‌తో పాటు పిల్లలు ఆడుకునేందుకు వీలుగా పరికరాలు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కుకు క్యూ కడుతున్నారు.



వుడా కాలనీలోని న్యూ పార్కు ఎంట్రన్స్

- కేరాఫ్ వుడా లే అవుట్ న్యూ పార్కు
- పార్కులో భద్రతకు సీసీ కెమెరాలు
- యోగా సాధనకు ప్రత్యేక ఏర్పాట్లు
- అందుబాటులో అధునాతన బ్యాడ్మింటన్ కోర్టు
- క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ



గ్రీనరీ మధ్య వాకింగ్ ట్రాక్



యోగా కోసం నిర్మించిన హాల్

క్రీడాకారులకు ప్రత్యేక ఏర్పాట్లు

వుడా కాలనీ న్యూ పార్కులో బాల్ బాడ్మింటన్ క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం మాదిరిగా ప్రత్యేకంగా పెద్ద షెడ్డు ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రతీ రోజూ 60 మంది వరకు కాలనీకి చెందిన బాల, బాలికలు బాల్‌బాడ్మింటన్ క్రీడాలో తర్ఫీదు పొందేలా కాలనీ అసోసియేషన్ వారు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా పార్కులో యోగ చేసే వారి కోసం ప్రత్యేక హాల్ నిర్మించారు.



విశాఖ విద్య: వుడా కాలనీలోని న్యూ పార్కు ఆహ్లాదకరమైన వాతారణం పంచుతోంది. గ్రీనరీ పరిరక్షణకు కాలనీ అసోసియేషన్ ప్రత్యేక శ్రద్ధ చూపడంతో ఇక్కడ పచ్చని చెట్లు పొదరిల్లులా అల్లుకుంటున్నాయి. విశాలమైన పార్కులో గ్రీనరీ అభివృద్ధి చేయడంతో ఇక్కడ ఎక్కువ సేపు గడిపేందుకు కాలనీ వాసులు ఆసక్తి చూపుతున్నారు. పిల్లలు, వృద్ధులు, ప్రధానంగా మహిళలకు ఉపయోగకరంగా ఉండేలా ఇక్కడ తగిన సౌకర్యాలు కల్పించారు.

డిప్యూటీ మేయర్ శ్రీధర్ ప్రత్యేక చొరవ

కాలనీ వాసుల విన్నపాల మేరకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని పార్కు ఆధునికీకరణకు జీవీఎంసీ ద్వారా నిధులు కేటాయింపు చేశారు. దీంతో వార్డు పరిధిలోని పార్కులకు భిన్నంగా దీన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పార్కు లోపలకి **అడుగు** పెడితే ప్రత్యేక అనుభూతి **కలు**గుతుంది. పచ్చదనం **స్వాగతం** పలుకుతుంది. పరిసరాలు **ఆహ్లాదకరం**గా ఉండడంతో సమయం తెలియదు. దీనికి తోడు పచ్చని చెట్ల కింద సేదతీరేందుకు బల్లలు ఏర్పాటు చేయడంతో వృద్ధులు ఉత్సాహంగా గడుపుతున్నారు.

పార్కు పరిరక్షణ సామాజిక బాధ్యతగా...

గత ప్రభుత్వం జీవీఎంసీ ఆధ్వర్యంలో పార్కులను అభివృద్ధి చేసింది. అయితే వీటి నిర్వహణ కూడా ఎంతో ప్రధానం. మెయింటెన్స్ సవ్యంగా లేకుంటే కొన్ని రోజులకే పార్కు కళావిహీనంగా మారే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే తమ సామాజిక బాధ్యతగా వుడా కాలనీ వాసులు న్యూ **పార్కు పరి**రక్షణకు ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు. కాలనీ అసోసియేషన్ ద్వారా పారిశుధ్య నివారణ చర్యలు చేపడుతున్నారు. పార్కుకు వచ్చే వారికి ఎటువంటి అభద్రత లేకుండా సీసీ కెమెరాలు ఇక్కడ ఏర్పాటు చేశారు. స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టడం వంటి చర్యలు కాలనీ వాసుల సామాజిక బాధ్యతకు అద్దం పడుతోంది.

పార్కు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



కాలనీలో జీవీఎంసీ ద్వారా అభివృద్ధి చేసిన పార్కు నిర్వహణపై తాము కూడా బాధ్యత తీసుకుంటున్నాం. పార్కుల్లో వ్యాయామ పరికరాలు, పిల్లలకు ఆట వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. బాడ్మింటన్ కోర్టు అందుబాటులో ఉండడంతో చిన్నావారితో పాటు పెద్దవాళ్లకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే మెయింటెన్స్ బాధ్యతను కాలనీ అసోసియేషన్ తరపున తీసుకున్నాం.

– సీహెచ్‌వీ.సురేష్, కాలనీ అసోసియేషన్ కార్యదర్శి

ఏడాదిగా బ్యాడ్మింటన్ సాధన



నేవీ చిల్డ్రన్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాను. పార్కులో బాల్‌బాడ్మింటన్ శిక్షణకు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఏడాది నుంచి ప్రతీ రోజూ ఇక్కడికి వచ్చి బాల్ బ్యాడ్మింటన్ నేర్చుకుంటున్నాను. ఇక్కడ సౌకర్యాలు కూడా చాలా బాగున్నాయి. స్నేహితులతో కలసి ఎంచక్కా ఆడుకుంటాం.

– సాత్విక, విద్యార్థి

కాలనీ సంపదను కాపాడుకోవాలి



పార్కులు అందరికీ ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రతీ ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలి. పార్కులు అభివృద్ధి చేశారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులపై ఉంది.ఇలాంటి అంశాలపై కాలనీ వాసులకు అవగాహన కల్పించడంతో పాటు తాము కూడా శ్రద్ధ తీసుకుంటున్నాం.

:– డాక్టర్ శిరీష, వుడాకాలనీ

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో వెలసిన నూకాంబిక అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి అమ్మావారికి పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకాలు, పసుపు–కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో కేక్ కట్ చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే నెల 27వ తేదీ నుంచి నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కాలనీ పురవీధుల్లో అమ్మవారి ఘటాలు ఊరేగించడం.. 29న అమ్మవారి అనుపు మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పూజల్లో సేనాపతి తాతబాబు, జెర్రిపోతుల బాబూరావు, గంటా వర్మ, జెర్రిపోతుల నర్సింగరావు, కోరుకొండ నాని, సందక గోవింద, గొంతిన శ్రీను, కంఠంరెడ్డి అప్పనాయుడు, జేసీబీ శ్రీను, గొర్రెల సత్తిబాబు, వరపల మహేష్, గణేష్ మిశ్రా, అడప రమణ, గొంప వాసు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో 60 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి శనివారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఢిల్లీకి చెందిన బినా, పూజా అరోరా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలి జిల్లాకు చెందిన వివేక్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని, వారి నుంచి 60 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

‘బర్మా క్యాంప్ కథలు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖ, అరసం విశాఖ జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హరివెంకటరమణ రాసిన బర్మా క్యాంప్ కథలు పుస్తకావిష్కరణ సభ శనివారం ఏయూ తెలుగు విభాగంలో జరిగింది. విజయకుమార్ మార్కిస్ట్ అధ్యయన కేంద్రం అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి నిర్వాహకులతో కలసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బర్మా మిలటరీ ప్రభుత్వం పంపిచ్చేస్తే పొట్ట చేతపట్టుకొని వచ్చినటువంటి బర్మా కాందిశీకుల అనుభవాలు, కష్టాలు, నష్టాలు అన్నీ కూడా ఈ కథల్లో కనిపిస్తాయని చెప్పారు. భావితరాలకు వర్తమానంలో జరిగే సంఘటనల గురించి తెలియాలంటే ఇలాంటి కథలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్య అన్నం శెట్టి ఈశ్వరమ్మ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, బసు పోతన, బర్మా క్యాంప్ కథల పుస్తకం పబ్లిషర్స్ సాయివంశీ గుండ్ల వెంకట్ నారాయణ, డాక్టర్ కె.వి.ఎస్, హరి వెంకటరమణ తల్లి అనంత లక్ష్మి, ఏయూ తెలుగు శాఖ విద్యార్థులు పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



చికిత్స పొందుతున్న విదేశీ విద్యార్థినిని పరామర్శిస్తున్న ఏయూ రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో విద్యనభ్యశించే విదేశీ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు తెలిపారు. ఆరోగ్యపరమైన సమస్యతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో బీబీఏ విద్యార్థిని సమంగాలే జుంగూను శనివారం ఆయన పరామర్శించారు. విద్యార్థిని పూర్తిగా కోలుకోవడంతో ఐసీయూ నుంచి రెండు రోజుల కిందట రూమ్‌కు మార్చారు. ప్రాణపాయం నుంచి బయటపడి విద్యార్థిని పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. విద్యార్థిని ఆరోగ్యంగా కోలుకోవడంపై ఏయూ రిజిస్ట్రార్ సంతోషం వ్యక్తం చేశారు.

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు కుంచుమాంబ కాలనీ వద్ద కోరమాండల్ ఇంటర్నేనల్ సంస్థ సౌజన్యంతో నిర్మించనున్న సామాజిక భవన నిర్మాణ పనులకు ఆ సంస్థ డీజీఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.42 లక్షల సీఎస్ఆర్ నిధులతో భవనం నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ ఉన్నతాధికారులతో పాటు కుంచుమాంబ కాలనీ వాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాపాడాలి



ఏయూ మెయిన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాఖ విద్య: యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు విజ్ఞప్తి చేశారు. విద్యా రంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ శనివారం ఆంధ్రా యూనివర్సిటీ మెయిన్ గేటు ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవో నంబర్ 77 రద్దు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తి కాపాడేలా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉమ్మడి పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేస్తామని పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీ పూర్తిగా మర్చిపోయారని ఎద్దేవా చేశారు. విద్యా శాఖ మంత్రి ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టడానికో లేదా రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారే తప్ప.. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంపై శ్రద్ధ చూపడం లేదన్నారు. కామన్ పీజీ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేసి, యూనివర్సిటీ పరిధిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన ర్యాలీ



ఆర్పీపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ నాయుడు

కంచరపాలెం: క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వ అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆర్పీపేట యూపీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక తెలిపారు. టీబీ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణలపై జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని తెలిపారు. సమాజంలో ఆడ, మగ భేదం ఉండకూడదన్నారు. గాంధీనగర్, గొల్లకంచరపాలెం, తోటవీధి, దుర్గానగర్, జాషువానగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ప్లకార్డులతో ర్యాలీ చేశారు. హెచ్ఎస్ సూర్యనారాయణ, ఎస్‌టీఎల్ఎస్ శరత్‌బాబు, టీబీహెచ్‌వీ నూనెల పైడిరాజు, ఎల్‌టీ పూర్ణిమ, హెచ్‌వీ భారతి, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం



శ్మశానవాటికలో పాత భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం పరిధిలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. వంద ఏళ్ల చరిత్ర గల హిందూ శ్మశానవాటికలో పలు సమస్యలు నెలకున్నాయి. షెడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. మురుగుదొడ్లు మూతపడ్డాయి. మంచి నీటి సదుపాయం లేకపోవడం వంటి సమస్యలు ఇక్కడ తిష్ట వేశాయి.దీంతో అంత్యక్రియలకు మృతుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్ స్పందించారు. సమస్యను జీవీఎంసీ కమిషనర్, నగర మేయర్ దృష్టిలో పెట్టారు. వారు స్పందించి సుమారు రూ.90 లక్షలు మంజూరు చేశారు.దీంతో తొలి విడగా శ్మశానవాటికలో పాత భవనం తొలగింపు పనులు చేపట్టారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు రిజర్వేషన్లు పెంచాలి



స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు బహుమతులు అందజేస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం : స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రైల్వే న్యూ కాలనీలో గల ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్కౌట్ కేంపింగ్ సెంటర్‌లో శనివారం వరల్డ్ థింకింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ సంఖ్య పెరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగాలు, ఇతర రంగాల్లో ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల శాతం మరింత పెంచితే ఎక్కువ మంది ఆసక్తి చూపుతారన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తమ కమిషన్ తీసుకెళ్తుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని మరిన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ సంఖ్య పెంచేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వరల్డ్ థింకింగ్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు సర్టిఫికెట్స్, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్కౌట్స్ సంస్థ కార్యదర్శి కేఆర్ జగన్నాథం, సంస్థ వైస్ ప్రెసిడెంట్ నరవ ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి హరీష్‌కుమార్, చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ప్రతినిధి కె.ఎల్లయ్య, జిల్లా కమిషనర్లు ఎస్‌వీ రమణ, ఆర్.మధుసూధనరావు, కె.పద్మ, జీవై నాయుడు, అసిస్టెంట్ సెక్రటరీ జి.సంధ్యారాణి పాల్గొన్నారు.